# ఎర్ర అంచు - తెల్ల చీర

లత నిద్రరాక అటూ, ఇటూ, పొర్లుతోంది. వయస్సులో వున్న ఆడపిల్ల కోరికలు దారం వదిలిన గాలి పటం లాంటివి. గమ్యం తెలియక అటూ, ఇటూ పయనిస్తాయి.

తనకు ఇది కావాలి. అని ఎప్పు...డూ, ఎవ్వర్నీ అడగలేదు లత. అసలు ఆ కుటుంబంలో కోరికలకు సమాధి చేసి చాలా ఏళ్ళు అయింది.

అలాంటిది లత సాయంత్రం షాపులో బొమ్మకు కట్టిన ఎర్రంచు తెల్ల చీర చూసినప్పటినుంచి కావాలనే తహతహను అణుచుకోలేక పోతోంది. అది తీరే కోరిక కాదని ఆమెకు తెలుసు. తనకు వచ్చే వెయ్యి రూపాయల్లో తను, తల్లీ, తమ్ముడు బ్రతకాలి. ఒక పూట తిండికే చాలని ఆ జీతంలో తనా చీర కొనలేదు సరికదా - దాని ధర అడిగే అర్హత కూడా తనకు లేదు. ఆమె గాఢంగా నిట్టూర్చి కళ్ళు మూసుకుంది.

"లతా! మీరీ చీరలో చాలా బాగున్నారు. మీలో ఎన్నడూ చూడని కొత్త అందాలు కనువిందు చేస్తున్నాయి". చిలిపిగా ఆమె వంక చూస్తు అన్నాడు మధు.

అతని మాటలకు పరవసిస్తున్న లత తల్లి విపరీతంగా దగ్గడంతో ఈ లోకంలోకి వచ్చింది. జరిగింది వాస్తవం కాక పోయినా, ఆ తలపులకు ఆమె బుగ్గల్లో మందారాలు పూచాయి.

* * *

ఆరోజు లత బస్సు కోసం వెయిట్ చేస్తోంది. ఆమె చూపులు ఎదురుగా వున్న 'వాణీ టెక్స్‌టైల్స్'లో బొమ్మకు కట్టిన 'ఎర్రంచు తెల్ల చీర' మీద వున్నాయ్. ఆ చీర ఆమెను రారమ్మని ఊరిస్తోంది.

"ఏమిటండోయ్! విలబడే కలలు కుంటున్నారు?" అంటూ, అప్పు..డే వచ్చిన ఆమె కొలీగ్ మధు నవ్వుతూ అన్నాడు.

లత తన పరధ్యాన్నానికి సిగ్గుపడి ఏమీ లేదని తల ఊపింది. మధు ఆమెను చూసి జాలిగా నవ్వుకున్నాడు.

అతను వారం రోజుల నుండీ ఆమెను గమనిస్తున్నాడు. బస్టాండ్‌కి రావడంతోనే లత ఆ చీర వంక కన్నార్పకుండా చూడటం. అతనికి ఆమె పరిస్థితి తెలుసు. మనస్సులో ఒక నిశ్చయానికి వచ్చి అప్పు..డే వచ్చిన బస్సు ఎక్కాడు మధు.

లతకు చాలా సంతోషంగా వుంది. దానికి కారణం ఆరోజు ఆఫీసులో ఫెస్టివల్ అడ్వాన్సు తీసుకుంది. డబ్బు చేతికి రాగానే చీర ఎలాగయినా కొనాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఆమె ఆ ఆనందంలో ఎక్కువ సేపు వుండలేక పోయింది. ఆమె తమ్ముడు హడావిడిగా వచ్చి,

"అక్కా! అమ్మకు ఆయాసం ఎక్కువయింది. దగ్గీ, దగ్గీ, మాట్లాడకుండా పడిపోయింది. నాకు భయమేసి, నీ దగ్గరకు వచ్చాను." అని ఏడుస్తూ చెప్తున్న తమ్ముడిని చూసి, మ్రాన్పడి పోయింది లత. ఆటోలో ఇంటికి వెళ్ళి అదే ఆటోలో తల్లిని తీసుకొని హాస్పత్రికి తీసుకు వచ్చింది. పరీక్షలన్నీ పూర్తయి, డాక్టర్‌కి ఫీజు ఇచ్చి, మందులు కొని ఇంటికి వచ్చి పరుసులో వున్న చిల్లర చూసుకొని చిన్నగా నిట్టూర్చింది లత.

* * *

ఇంటి ముందు ఆటో ఆగడంతో 'ఎవరా?' అని చూసింది. ఆటో లోంచి ఒక పాతికేళ్ళ యువతి దిగి తమ ఇంటిపైపు రావడంతో ఆశ్చర్యంగా' ఎవరా?' అని చూస్తు నిలబడింది లత

" మీరు ప్రేమలత కదూ....?"

అవునన్నట్లు తలఊపింది లత.

"నేను మీ కొలీగ్ మధుగారి భార్యను. రేపు మాఇంట్లో వరలక్ష్మీ వ్రతం చేసుకుంటున్నాను. మిమ్మల్ని పిలవటానికి వచ్చాను. మీరు రేపు సెలవు పెట్టి రండి. భోజనానికి అక్కడికే. మావారు కూడా మరీ, మరీ చెప్పమన్నారు. " హడావిడిగా మాట్లాడుతున్న ఆమె వంక ఆశ్చర్యంగా చూసింది లత. మధుకు పెళ్లి అయినట్లు, ఇంత అందమయిన భార్య వున్నట్లు తనకు తెలియదు. అతను అవివాహితుడని ఇన్నాళ్ళు అతనిపై ఆశలు పెంచుకుంది. బరువుగా వచ్చిన నిట్టూర్పును అణుచుకుంటూ ఆమెను లోపలకు తీసుకు వెళ్ళింది లత.

"నేను సెలవు పెట్టమంటే, ఇప్పు...డా రావడం...?" సాయంత్రం ఆరుగంటలకు వచ్చిన లతను చూసి నిష్టూరంగా అంది మధు భార్య సుధ.

"క్షమించండి సుధగారూ! ఇప్పటికే అమ్మ అనారోగ్యంతో వున్న సెలవు లన్నీ ఖర్చు అయ్యాయి."

"పోనీలెండి ఇప్పటికైనా వచ్చారు చాలా సంతోషం." నవ్వుతూ అంది సుధ.

భోజనాలన్నీ అయ్యేటప్పటికి రాత్రి ఎనిమిది అయింది. ఒక పళ్ళెంలో చీరా, జాకెట్టు, తాంబూలంపెట్టి లత కందించింది సుధ.

ఆ చీరను చూడగానే లత కళ్ళు ఆనందంలో మిల,మిల మెరిశాయి. అది తను ఎన్నో రోజుల నుంచి చూపులతో తృప్తిపడ్డ ఎర్రంచు తెల్లచీర

"ఏమిటి సుధగారూ! పేరంటానికని పిలిచి ఈ చీర సారెలు" మొహమాటంగా అంది లత. ఈ పరిస్థితి ఆమెకు ఇబ్బందిగాను వుంది.

"చూడండి లతా! నేను ఈ చీర మీకు సరదాకోసం పెట్టలేదు. ఈ రోజు లక్ష్మీదేవి వ్రతం చేసుకున్నాను. కన్నె ముత్తయిదువుకు పెట్టాలని పించింది పెట్టాను. ఇందులో మీ రంతగా మొహమాటం పడవలసిన పనిలేదు. మీ అక్కయ్య పెడితే తీసుకోరా, నన్ను కూడా అలాగే భావిం



చండి!"

ఆమె అభిమానానికి, లత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమెకు థ్యాంక్స్ చెప్పి ఇంటికి బయలు దేరింది లత.

దారిలో ఆ చీరను తనివి తీరా ఒకసారి చూసుకుంది. పాల నురుగులాంటి తెల్లచీరకి ఎర్రటి శాటాన్ బార్డరు తనను ఇన్నాళ్ళు ఊరించిన చీర ఇపుడు తన చేతిలో వుంది ఆమె ఆనందంగా ఇంటికి చేరుకుంది.

తల్లితో మాట్లాడుతున్న కొత్త వ్యక్తిని చూసి గుమ్మంలోనే ఆగి పోయింది లత.

"రా. లతా.... ఈవిడ జానికి పిన్ని. నీకు గుర్తులేదను కుంటా. మీ నాన్న గారు పోయిన రోజుల్లో అయినవాళ్లు మనల్ని కాదని వెళ్లి పోతే మనల్ని వీళ్ళ కుటుంబం ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారు. వీళ్ళింట్లో వున్నన్నాళ్ళు మనకు ఎలాంటి ఇబ్బంది వుండెడి కాదు. మన దురదృష్టం వల్ల వీరికి దూర దేశానికి ట్రాన్స్‌ఫర్ కావడంతో మనం విడిపోయాం. మళ్ళి ఇన్నాళ్ళకు రఘుమామయ్య ద్వారా అడ్రసు తెలుసుకొని వెతుక్కుంటూ వచ్చారు. లత తల్లిని తదేకంగా చూస్తు వుండి పోయింది. ఆత్మీయుల్ని చూసిన ఆనందంలో ఆమె ముఖం వెలిగి పోతోంది. తల్లిని ఆస్థితిలో చూసిన లతకు ఆనందమేసింది.

"రామ్మా లతా – ఎప్పుడో చిన్నప్పుడు చూశాను, ఎంత ఎదిగి పోయావ్!" ఆప్యాయంగా పలకరించిన ఆవిడకు నమస్కారం చేసింది.

* * *

"అమ్మా లతా – నీతో ఒక విషయం మాట్లాడాలి.....?"

"చెప్పమ్మా – నాదగ్గర నీకు సందేహ మెందుకు?" తల్లి వంక చూస్తూ నవ్వుతూ అంది లత.

"ఏం లేదమ్మా!.... జానకి పిన్ని రాక, రాక మనింటికి వచ్చారు. గతంలో మనకెంతో సహాయం చేసిన అమృత మూర్తి ఆమె. ఈ పరిస్థితిలో మనకు భారమైనా తప్పదు. ఆమెకు చీర పెట్టక పోతే బాగుండదు తల్లీ. రేపు నా దుద్దులు అమ్మి ఆమెకు చీరా, జాకెట్ తీసుకురా.."

"అమ్మా...వద్దమ్మా – మనకు వున్న ఆస్తి ప్రస్తుతానికి అవే. ఏ సమయంలో వాటి అవసరం వస్తుందో, అవి అమ్మ వద్దమ్మా! ఆ సంగతి నేను ఆలోచిస్తాగాని, నువ్వు నిశ్చింతగా నిద్రపో...."

తల్లితో ఆమాట అననైతే అంది గానీ, ఏం చెయ్యాలో ఆమెకు తోచలేదు. తల్లి ఎన్నడూ ఎలాంటి కోరికా తనను కోరలేదు. తన సంపాదనతో రెండు పూటలా భోజనమే తనకు భారమని ఒక్క పూటే చేసేది. అలాంటి తల్లి వచ్చిన అతిధికి చీర పెట్ట మని అడిగింది. ఆమె కోరిక కాదనే ధైర్యం తనకు లేదు. చివరకు ఒక నిశ్చయానికి వచ్చిన లత నిశ్చింతగా పడుకుంది.

జానకమ్మగారికి బొట్టు పెట్టి, చీర పెడుతున్నప్పుడు లత చేతులు కంపించాయి. తన శరీరంలో ఒక భాగం లోల్పోయినంతగా బాధపడింది. క్రితం రోజు తనను మైమరపించిన చీర ఇపుడు జానకమ్మ గారిచేతిలో వుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఆడపిల్లను అప్పగింతలప్పుడు అత్తగారి చేతిలో పెడుతున్నంతగా బాధపడింది లత.

* * *

కాల ప్రవాహంలో ఇరుపై సంవత్సరాలు కరిగి పోయాయి. ఇపుడు లత ఇద్దరు పిల్లల తల్లి.

ఆమె తల్లి చనిపోవడం, తమ్ముడు పెళ్ళి చేసుకొని, తనను వదిలి వెళ్ళి పోవడంతో తన ఆఫీసులోనే పని చేస్తున్న ఆనందరావుని పెళ్ళి చేసుకోవడం, అంతా కలగా జరిగిపోయింది. చాలీ, చాలని జీతాలు. ఆకాశం అంటే ధరలు. ప్రతినెలా ఎన్నో ఖర్చులతో సతమతమయ్యే ఆనందరావుకి భార్య మొదటి రాత్రి తనకు ఎర్రంచు తెల్లచీర కొనిపెట్టని కోరినపుడు అదెంతో తేలిక విషయంగా భావించి ఆమెకు అభయ హస్తం ఇచ్చాడు. కానీ, తరువాత పెళ్ళికని చేసిన అప్పు..., కొత్త సంసారం, వేవిళ్ళు, పురుళ్ళతో నెలతిరిగేటప్పటికి అప్పు..లే గానీ, ఆదాయం శూన్యమయిన తన బ్రతుకులో భార్య కోరకను ముడుపు లాగా తనమనస్సులో దాచుకున్నాడు గానీ, తీర్చలేకపోయాడు. పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దాలనే తపనలో వున్న లత తన కోరికను తాత్కాలికంగా సమాధి చేసుకుంది.

ఆరోజు ఆనందరావుకి ఆనందంతోగంతులు వెయ్యాలనిపించింది. అతనికి భాగ్యలక్ష్మిలాటరీలో ఐదు వేలు వచ్చింది. ఎప్పుడో చిల్లరకోసం లాటరీ కొన్న ఆనందరావుకి అదృష్టం కలిసివచ్చింది. డబ్బు చేతికి రాగానే బట్టల షాపులన్నీ వెతికాడతను. తన భార్య కోరిన ఎర్రంచు తెల్ల చీర ఎక్కడా అతనికి కనపడలేదు. నిరాశగా తిరిగి వస్తున్న అతనికి ఒక షాపులో బొమ్మకు కట్టి వుంది. తప్పిపోయిన కొడుకు అకస్మాత్తుగా కనిపించినంతగా సంబరపడిపోయాడు ఆనందరావు. చీరను ప్యాక్ చేయించి ఇంటికి బయలు దేరాడు. ఆచీర చూడగానే తన భార్య కళ్ళల్లో మెరిసే మెరుపు తనివి తీరా చూడాలని ఆనందంగా అడుగులు వేశాడతను.

ఇంటిముందు గుమిగూడిన జనాన్ని చూసి హడావిడిగా లోపలకు పరుగెత్తాడు అనందరావు.

ఎదురుగా కాలిన శరీరంతో మాంసంముద్దలావున్న భార్యను చూసి 'లతా......' అంటూ ఆమె మీద కూలిపోయాడు.

"నాన్నా – అమ్మ చీరకు స్టవ్ అంటుకుంది. ఒక్కసారిగా పెద్ద మంట వచ్చింది. అన్నయ్యా నేను ఆర్పటానికి ప్రయత్నిస్తే మంటలు మాకు అంటుకుంటాయని మమ్మల్ని రానివ్వలేదు." ఏడుస్తూ చెపుతున్న కూతురి కేసి వెర్రి వాడిగా చూశాడు ఆనందరావు.

కన్నె వయస్సులో కోరుకున్న 'ఎర్రంచు తెల్ల చీర'ను కాటికి వెళ్ళేటప్పుడు కట్టుకుని నిశ్చింతగా కళ్ళుమూసుకుంది పాపం లత!

